క్లుప్తంగా

రక్తదానం మహాదానం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న కొత్త రామారావు

కుషాయిగూడ: రక్తదానం మహాదానమని లయన్ ఆసుపత్రి చైర్మన్, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు అన్నారు. ఆదివారం లయన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కుషాయిగూడ, సృజన తెలంగాణ తలసేమియా బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో లయన్స్ ఆసుపత్రిలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో లయన్ మధుసూదన్‌రెడ్డి, రవి శంకర్‌రాజు, రామచందర్, పురుషోత్తంరావు, గోపి తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి కమిటీ సమావేశం



బొడ్రాయి వద్ద నాచారం గ్రామ పెద్దలు

మల్లాపూర్: బొడ్రాయి పండగ సందర్భంగా ఆదివారం నాచారం గ్రామ పెద్దలు పండగ గురించి మహంకాళి ఆలయంలో చర్చించారు. ఈ నెల 21, 22, 23వ తేదీల్లో 5వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో నాచారం గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



జేసీబీతో అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

బోడుప్పల్: రాజీవ్‌నగర్‌లోని ప్రభుత్వ స్థలంలో అక్రమంగా వెలిసిన నిర్మాణాన్ని రెవెన్యూ అధికారులు జేసీబీతో కూల్చివేశారు. ఈ సందర్భంగా మేడిపల్లి తహసీల్దార్ మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ స్థలంలో బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

బోడుప్పల్‌లో ఈస్టర్ ఆరాధనలు

బోడుప్పల్: బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాలలో ఆదివారం జిప్సి చర్చి ఆధ్వర్యంలో ఈస్టర్ ఆరాధనలను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు హాజరై మాట్లాడుతూ సమాజంలో ప్రజలందరూ సహనం, ప్రేమ, కరుణ, దయ కలిగి ఉండాలన్నారు. అంతేగాకుండా ఇరుగు పొరుగు వారితో సోదరభావం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పాస్టర్ పన్నీర్ సెల్వం, సంఘ పెద్దలు రాంబాబు, సాగర్, దాస్, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడి

మల్కాజిగిరి: న్యాయవాదిపై దాడి చేసిన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ హరిప్రసాద్ వివరాల ప్రకారం.. ఒంపుగూడకు చెందిన న్యాయవాది లక్ష్మీకాంత్‌రావు ఆదివారం తెల్లవారుజామున తన కారులో రాంకోటి నుంచి ఇంటికి వెళ్తుండగా కుషాయిగూడ బస్‌డిపో దగ్గర ఎదురుగా ద్విచక్రవాహనంపై వచ్చిన వ్యక్తి ఢీకొట్టాడు. ఢీకొట్టిన వ్యక్తిని ప్రశ్నిస్తుండగా సమీపంలో ఉన్న డిపో నుంచి మరి కొందరు వచ్చి తనపై దాడి చేశారని ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

రంజాన్ కానుకల పంపిణీ



మల్కాజిగిరి: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన కానుకలను మల్కాజిగిరిలోని మజిద్‌లో ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మజిద్ కమిటీ ప్రతినిధులు అహ్మద్, జాకీర్, గౌస్, అల్తాఫ్, షబ్బీర్, టీఆర్ఎస్ నాయకులు సత్యనారాయణ, బాబు, సంపత్, కిషోర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కీసర: చీర్యాల చౌరస్తాలో తెల్లవారు జామున రోడ్డు ప్రమాదం జరిగింది. యాదాద్రి జిల్లా రాజాపేట్‌కు చెందిన వంశీ, సుమన్ పల్సర్ బైక్‌పై అంబేడ్కర్‌నగర్ నుంచి రాజాపేటకు అతి వేగంగా వెళ్తుండగా బైక్ అదుపు తప్పి కల్వర్టును ఢీ కొట్టింది. వంశీ అక్కడికక్కడే మృతి చెందాడు. సుమన్ గాయపడ్డాడు. చికిత్స కోసం అతడిని గాంధీ ఆసుపత్రిలో చేర్పించామని కీసర సీఐ రఘువీరారెడ్డి తెలిపారు.

ధరణి.. చిక్కులెన్నో..?

తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ బాధితుల ప్రదక్షిణలు

- రెండేళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్యలు బోలేడు..
- జిల్లాలో పేరుకుపోయిన దరఖాస్తులు 1,100 పైనే..



సాక్షి, మేడ్చల్‌జిల్లా: భూదస్త్రాల ప్రక్షాళనే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ గ్రామాల్లోని రైతులను అష్టకష్టాలకు గురిచేస్తోంది. మిస్సింగ్ సర్వే నంబర్లు, భూవిస్తీర్ణంలో తేడాలు, భూమి రకంలో తేడాలు, నిషేధిత జాబితా నుంచి తొలగించడం, పట్టా భూమి అసైన్డ్ భూములుగా నమోదవడం వంటి సమస్యలతో ప్రధానంగా అన్నదాతలకు చిక్కులు ఎదురవుతున్నాయి. పాత 1బీ దస్త్రాల్లోని భూముల వివరాలు కొత్త పాసుపుస్తకాల్లో తప్పుగా నమోదు కావడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. భూసమస్యల పరిష్కారానికి టీఎం–33 పేరున మాడ్యుల్‌ను ప్రభుత్వం తీసుకురావడంతో రైతులు పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. పోర్టల్‌లో నమోదైన తమ సమస్యల పరిష్కారానికి పలువురు రైతులు దరఖాస్తు చేసుకోగా వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో, పాత రికార్డుల ఆధారంగా పరిష్కరిస్తున్నట్లు రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నా.. జిల్లావ్యాప్తంగా సుమారు 1,100 దరఖాస్తులు అపరిష్కృతంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి ధరణిలో నమోదైన భూసమస్యల పరిష్కారానికి తక్షణం చొరవ చూపాలని బాధితులు కోరుతున్నారు.

ఆప్షన్ పని చేయక..

ప్రభుత్వం ఈ మధ్య టీఎం–33 (పాసు పుస్తకాల్లో డేటా కరెక్షన్) చేర్పులు, మార్పులు చేసేందుకు అవకాశం కల్పించింది. విస్తీర్ణంలో హెచ్చు తగ్గులు వంటి సవరణకు రైతులు మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే తహసీల్దార్ పరిశీలించి కలెక్టర్ లాగిన్‌కు నివేదిస్తే అన్ని విధాలా పరిశీలించి ఆమోదించాల్సి ఉంటుంది. ఈ ఆప్షన్ సరిగా పనిచేయనందున ఎక్కడి వేసిన గొంగలి అక్కడే అనే చందంగా మారింది. దీంతో దరఖాస్తుదారులకు ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. మీ సేవలో దరఖాస్తు చేసుకునేందుకు రూ.1,500 వరకు ఖర్చు అవుతోందని, అయినా పనికావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సవరణల కోసం తిప్పలు

ధరణి పోర్టల్ ప్రారంభ సమయంలో ఏర్పడ్డ లోపాలను సవరించే క్రమంలో భూలబ్ధిదారులకు తిప్పలు తప్పట్లేదు. కొందరు రెవెన్యూ అధికారులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుడటంతో ప్రభుత్వ భూమి జాబితాలో పట్టా భూములు, సర్వే నంబర్లలో లోపాలతో ఎన్నో ఏళ్లుగా ఉన్న భూములను అవసరానికి అమ్ముకోలేని దుస్థితి. గతంలో అమ్మిన వారి పేరుపైనే పట్టాపాసు పుస్తకాలు జారీ చేస్తుండటంతో.. కొనుగోలుదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ధరణి సమస్యల పరిష్కారానికి పలుమార్లు దరఖాస్తు చేసినా.. కుంటిసాకులతో అధికారులు తిరస్కరిస్తున్నట్లు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మొర పెట్టుకున్నా.. పరిష్కారం లేదు

ఏన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న మూడు ఎకరాల వ్యవసాయ భూమిలో 25 గుంటలు ధరణి పోర్టల్‌లో నమోదు కాలేదు. సరి చేయాలని మీ సేవా ద్వారా రెండుసార్లు దరఖాస్తు చేసుకుని రెండేళ్లుగా కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా.. ఇప్పటి వరకు సమస్య పరిష్కారం కాలేదు.

– ఏన్‌కే యాదవ్, యాప్రాల్

విక్రయించలేక పోతున్నాం

కీసర మండలం దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని కుందనపల్లిలో 30 మంది కలిసి ఇళ్ల స్థలాలు తీసుకున్నాం. గోధుమకుంటలో ఇదే సర్వే నంబర్‌తో ఉన్న వ్యవసాయ భూమి నిషేధిత జాబితాలో ఉండటంతో.. మా స్థలాలనూ అదే జాబితాలో చేర్చారు. దీంతో అమ్ముకోలేక పోతున్నాం.

– ఏంఎస్‌రావు, ఏఎస్‌రావు నగర్

పట్టా భూమి అసైన్డ్‌గా నమోదు

శివారులోని తన భూమిని ఆర్నెల్ల క్రితం ఇతరులకు విక్రయించా. రిజిస్ట్రేషన్ కోసం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లగా అసైన్డ్ భూమిగా నమోదై ఉండటంతో రిజిస్ట్రేషన్ చేయడం వీలు కాదన్నారు. పట్టా భూమిగా మార్చేందుకు ఇప్పటికి మూడుసార్లు దరఖాస్తు చేసినా పరిష్కారం కాలేదు.

– రాంరెడ్డి, నాగోల్

బీజేపీ హయాంలో ఓబీసీలకు ఎన్నో సంక్షేమ పథకాలు



అల్వాల్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ ఓబీసీ మోర్చా ప్రచార కార్యదర్శి జిల్లెల రవియాదవ్

అల్వాల్: అల్వాల్ డివిజన్ పరిధిలోని దినకర్‌నగర్‌లో ఆదివారం బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కార్తీక్‌గౌడ్ ఆధ్వర్యంలో పల్లెపల్లెకు ఓబీసీ–ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రచార కార్యదర్శి జిల్లెల రవియాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవియాదవ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ బీసీలకు చేసిన ప్రయోజనాల గురించి పల్లెపల్లెకు ఓబీసీ– ఇంటింటికీ బీజేపీ అనే కార్యక్రమంతో వివరిస్తున్నామన్నారు. ఓబీసీలకు మంత్రి వర్గంలో చోటు కల్పించారన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగంలోని అన్ని సంస్థల్లో విద్య, ఉపాధిలో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు, రాజకీయంగా, ఆర్థిక, విద్యా, సామాజిక న్యాయం, ఉద్యోగ ఉపాధితో పాటు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం బీసీకు అమలు చేసిన పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఈగ లావణ్యకృష్ణ, విఠోభా, తుప్రాన్ లక్ష్మణ్, రసూరి అనిల్, ఆనంద్, సంతోష్‌గౌడ్, మల్లికార్జున్‌గౌడ్, ప్రశాంత్‌రెడ్డి, సర్వేశ్వరరావు, రామ్‌సింగ్, మణిరత్నం, సర్వేష్ యాదవ్, ఏండ భాస్కర్ తదితరులు ఉన్నారు.

చెరువు శిఖంలో అక్రమ నిర్మాణం



రామంతాపూర్: చిన్న చెరువు శిఖం భూమిలో వారం రోజులుగా అక్రమ నిర్మాణం కొనసాగుతోంది. ఈ విషయాన్ని జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. జీహెచ్ఎంసీ రెవెన్యూ విభాగాలకు వరుస సెలవులు రావడంతో అక్రమార్కులు నిర్మాణాన్ని కొనసాగిస్తున్నారు. వెంటనే ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి చెరువులో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాన్ని అడ్డుకుని చెరువును కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

మజ్జిగ కేంద్రం ప్రారంభం



సాయినాథపురంలో మజ్జిగ కేంద్రాన్ని ప్రారంభిస్తూ..

మౌలాలి: శ్రీజ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో ఆదివారం సాయినాథపురంలో ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రతిరోజూ సుమారు వెయ్యి మందికి మజ్జిగ అందజేయాలన్న లక్ష్యంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని సంస్థ డైరెక్టర్ సూర్యమూర్తి, భారతి తెలిపారు. కార్యక్రమంలో వలంటీర్లు శ్రీకర్, జానకి, శాస్త్రీ, రమాదేవి, అరుణ్, రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కారం



ఉగాది పురస్కారం అందుకుంటున్న తులసి రమణాచార్యులు

మల్కాజిగిరి: సామాజిక, సాంస్కృతిక, సాహిత్య, ఆధ్యాత్మిక రంగంలో సేవలు అందిస్తున్న అక్షర కౌముది సంస్థ అధ్యక్షుడు తులసి రమణాచార్యులు ఉగాది పురస్కారం అందుకున్నారు. ఆదివారం నగరంలో జరిగిన కార్యక్రమంలో విశ్వభారతి మ్యాక్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్, తెలుగు భాషా చైతన్య సమితి సంయుక్తంగా పురస్కారాన్ని అందజేశారు.

చర్చీల్లో ఈస్టర్ ప్రార్థనలు

కుషాయిగూడ: చర్లపల్లి, మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్లలోని పలు చర్చీల్లో ఆదివారం ఈస్టర్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఐజీ కాలనీలోని సన్ ఆఫ్ మినిస్ట్రిస్ చర్చిలో నిర్వహించిన వేడుకల్లో బీఆర్ఎస్ సీనియర్ నేత బండారి లక్ష్మారెడ్డి పాల్గొని ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే హెచ్‌బీకాలనీ, రాజీవ్‌నగర్‌లోని షాలేము ప్రార్థన మందిరంలో జరిగిన వేడుకల్లో కార్పొరేటర్ ప్రభుదాస్ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. నేమూరి మహేష్‌గౌడ్, పాస్టర్లు పాల్గొన్నారు.



చర్లపల్లి, ఐజీ కాలనీలో ఈస్టర్ వేడుకల్లో బీఆర్ఎస్ నేత బండారి లక్ష్మారెడ్డి



హెచ్‌బీకాలనీలో కార్పొరేటర్ ప్రభుదాస్

ఎన్‌టీఆర్‌నగర్‌లో కార్పొరేటర్ పాదయాత్ర



ఎన్‌టీఆర్‌నగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: స్థానికంగా నెలకొన్న సమస్యలు తెలుసుకునేందుకు డివిజన్ పరిధిలోని ఎన్‌టీఆర్‌నగర్‌లో ఆదివారం కార్పొరేటర్ ప్రభుదాస్ పాదయాత్ర చేశారు. కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు కాలనీలో తాగునీరు, డ్రైనేజీ సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడిన కార్పొరేటర్ దశలవారీగా అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మధు, వాసు, భీష్మ తదతరులు పాల్గొన్నారు.

మంత్రి మల్లారెడ్డికి ఆహ్వానం

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో ఈ నెల 14వ తేదీన నిర్వహించే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలకు హాజరు కావాలని జవహర్‌నగర్ మహనీయుల ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మండల సురేందర్ ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డిని కలిసి ఆహ్వానం అందజేశారు. ఇందుకు మంత్రి మల్లారెడ్డి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్లు, మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, ఉత్సవ కమిటీ సభ్యులు పరుశురాం, బూడిద వెంకటేష్, శ్రీనివాస్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి మల్లారెడ్డికి ఆహ్వానపత్రం అందజేస్తున్న మహనీయుల ఉత్సవ కమిటీ సభ్యులు

వైభవంగా లక్ష్మీ గణపతి ఆలయ బ్రహ్మోత్సవాలు



మరకత శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో హోమం చేస్తున్న మోత్కూరు సత్యనారాయణశాస్త్రీ



లక్ష్మీ వేంకటేశ్వర దేవస్థానంలో శ్రీవారి కల్యాణం

అల్వాల్: కానాజీగుడలోని మరకత శ్రీలక్ష్మీ గణపతి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం మరకత శ్రీలక్ష్మీ గణపతి స్వామికి సుప్రభాతసేవ, విశేష అభిషేకాలు, కలశ స్థాపన చేశారు. హరచతుర్థిని పురస్కరించుకొని ప్రత్యేక హోమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవ హోమాలతో పాటు భక్తులచే లక్ష్మీకుబేర, ఇత్యాది హోమాలు నిర్వహించారు. నీరాజన, తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు మోత్కూరు సత్యనారాయణశాస్త్రీ భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవారి కల్యాణం

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీ వేంకటేశ్వర దేవస్థానంలో ఆదివారం శ్రీవారి కల్యాణం ఘనంగా జరిగింది. ప్రధాన అర్చకులు ముడుంబై వేంకట రమణాచార్యులు, అర్చకులు తులసి రమణాచార్యులు కల్యాణాన్ని నిర్వహించారు. లోక కళ్యాణార్థం ప్రతినెలా రెండో ఆదివారం కల్యాణం నిర్వహిస్తామని దేవస్థానం ఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు.

స్లాటర్ హౌస్ నుంచి దుర్వాసన

- అధికారులు స్పందించాలంటూ ధర్నా
- పట్టించుకోకపోతే పెద్దఎత్తున ఆందోళన
- హెచ్చరించిన చెంగిచర్ల గ్రామస్తులు



స్లాటర్ హౌస్ వద్ద ధర్నా చేస్తున్న గ్రామస్తులు

బోడుప్పల్: చెంగిచర్లలోని స్లాటర్ హౌస్ దుర్వాసన నుంచి తమను కాపాడాలంటూ చెంగిచర్ల గ్రామస్తులు ఆదివారం ధర్నా నిర్వహించారు. వారికి మద్దతుగా బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బోడుప్పల్ బీజేపీ ప్రధాన కార్యదర్శి ఏర్పుల మహేష్, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ అధ్యక్షుడు కుర్రి మహేష్‌కుమార్ మాట్లాడుతూ స్లాటర్ హౌస్ నుంచి దుర్వాసన వస్తోందని, రాత్రి పూట భరించలేకపోతున్నామని అన్నారు. ఇటీవల కొత్తగా ఒక షెడ్ వేసి అందులో జంతు కళేబరాల నుంచి ఆయిల్ తీస్తున్నారని, దీంతో ఆ పరిసర ప్రాంతాల్లో విపరీతమైన వాసన వస్తోందన్నారు. సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి స్లాటర్ హౌస్‌ను తరలించాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో జయశ్రీ కాలనీ అధ్యక్షుడు సోమేష్‌యాదవ్, కాలనీవాసులు చంద్రశేఖర్, మనోజ్, లక్ష్మణ్, అశోక్, ప్రవీణ్‌గౌడ్, జహంగీర్ పాల్గొన్నారు.

చిల్డ్రన్స్ పార్క్, ఓపెన్‌జిమ్ ప్రారంభం



చిల్డ్రన్స్ పార్క్, జిమ్‌ను ప్రారంభిస్తున్న నెమలి అనిల్ తదితరులు

మల్లాపూర్: మాజీ కార్పొరేటర్ నెమలి సురేష్ జ్ఞాపకార్థం నెమలి సురేష్ ఫౌండేషన్ చైర్మన్ నెమలి అనిల్ సొంత నిధులు రూ.5 లక్షలతో మల్లాపూర్ జనప్రియ టౌన్‌షిప్‌లో ఎన్ఎస్ఆర్ చిల్డ్రన్స్ పార్క్, ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేశారు. నెమలి సురేష్ తల్లి మల్లమ్మ, భార్య మణెమ్మ చేతులమీదుగా ఆదివారం ప్రారంభించారు. అనంతరం నెమలి అనిల్ మాట్లాడుతూ.. తండ్రి అడుగు జాడల్లో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. నెమలి ఫౌండేషన్ తరఫున రానున్న రోజుల్లో విద్యా, వైద్యం వంటి సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నెమలి శ్రవణ్, సందీప్, రాజేష్, జనప్రియ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీమన్నారాయణ, ఉపాధ్యక్షుడు ఆంటోని చిన్నప్ప మరియన్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రావు, సురేష్ కుమార్, మురళీకృష్ణ, ఉమా మహేశ్వరావు, సూర్య చంద్రయూత్ క్లబ్ సభ్యులు, నెమలి ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

టెలిఫోన్ కాలనీ అధ్యక్షుడిగా ప్రభాకర్‌రెడ్డి



ప్రభాకర్‌రెడ్డికి నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల కమిటీ సభ్యులు

బోడుప్పల్: టెలిఫోన్ కాలనీ అసోసియేషన్ ఎన్నిక జరగగా అధ్యక్షుడిగా ఎ.ప్రభాకర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం కేవలం అధ్యక్షుడికి కోసం ఎన్నిక జరిగింది. మొత్తం 703 ఓట్లు ఉండగా 612 ఓట్లు పోలయ్యాయి. అధ్యక్ష బరిలో ఉన్న ఎ.ప్రభాకర్‌రెడ్డికి 363 ఓట్లు, బాల్‌రెడ్డికి 223 ఓట్లు, ఎం.వెంకటేశ్‌కు 25 ఓట్లు వచ్చాయి. ఎన్నికల కమిటీ సభ్యులు ఎం.రవీందర్‌రెడ్డి, రాపోలు వీరారెడ్డి, కె.సంపత్, ఎం.గోపీనాథ్, జె.విజయ కుమార్‌రెడ్డి 140 ఓట్లతో ప్రభాకర్‌రెడ్డి గెలుపొందినట్లు ప్రకటించి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ టెలిఫోన్ కాలనీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. గెలుపొందిన ప్రభాకర్‌రెడ్డిని బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు కృషి



కమిటీ సభ్యులు రాంచందర్ మాదిగకు చెక్కు అందజేస్తున్న మైనంపల్లి రోహిత్‌బాబు

అల్వాల్: నేరెడ్‌మెట్ డివిజన్ పరిధిలోని సీబీఎస్ కాలనీ వాంబే గృహాల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్, జ్యోతిరావుపూలే విగ్రహాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ చైర్మన్ మైనంపల్లి రోహిత్‌బాబు అన్నారు. ఆదివారం ఆయన సీబీఎస్, వాంబే గృహాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా విగ్రహాల ఏర్పాటు కోసం రూ.2.20 లక్షల చెక్కును కమిటీ సభ్యులు కేశపాక రాంచందర్ మాదిగకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఉపేందర్‌రెడ్డి, ఎస్సార్, ప్రసాద్, జీఎస్‌వీ సతీష్‌కుమార్, గోకుల్‌కుమార్, చెన్నరెడ్డి, గోపీనాథ్, బాలకృష్ణగుప్తా, గంగాధరి కృష్ణ, పీఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వారికి చేయూత

మౌలాలి: వినాయక్‌నగర్‌లో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బాధితులకు మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్(ఎంఎస్ఎస్‌వో) ఆధ్వర్యంలో ఆదివారం ఎంఎస్ఎస్‌వో చైర్మన్ డాక్టర్ మైనంపల్లి రోహిత్‌బాబు ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పిట్ల శ్రీనివాస్, జీఎస్‌వీ సతీష్‌కుమార్, సూరి, కృష్ణమూర్తి, బాలకృష్ణగుప్తా, ఉపేందర్‌రెడ్డి, ప్రసాద్, సత్తయ్య, సందీప్‌గౌడ్, జగదీష్‌యాదవ్, ఆగమయ్య, బాలరాజు యాదవ్, శ్రీను, నాగరాజు, చంద్రకాంత్, పార్థసారధి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న మైనంపల్లి రోహిత్

క్రీడలతో మానసిక ప్రశాంతత

కీసర: క్రీడలతో శారీరకంగా దృఢంగా ఉండటంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుందని టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి అన్నారు. దమ్మాయిగూడలో మున్సిపాలిటీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శోభారాణికృష్ణారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. యువకులతో కలిసి వాలీబాల్ ఆడారు. యువత క్రీడల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ మహిళా కార్యదర్శి పద్మ, నాయకులు సంజీవరెడ్డి, సుమేశ్, సునీత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.